క్లుప్తంగా

జీవాలను సంరక్షించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: జీవాలు వ్యాధుల భారిన పడకుండా గొర్రెలు, మేకల యజమానులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచార యోజన పథకం కింద వాటర్‌షెడ్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేకలు, గొర్రెలకు వచ్చే సీజనల్ వ్యాధులపై యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జబ్బుపడిన జీవాలను వైద్యశాలకు తీసుకొస్తే చికిత్స చేసి వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. అలాగే మందులను పంపిణీ చేస్తామన్నారు. వాటర్‌షెడ్ సిబ్బంది శివ, గోపాల మిత్ర నల్లన్న, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు నోటీసులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం, కైరుప్పల, జొహరాపురం గ్రామాలలో సక్రమంగా పని చేయని 16 మంది వలంటీర్లకు నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ రాధ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. జొహరాపురంలో-1, కైరుప్పలలో-8, ములుగుందంలో -7 మంది వలంటీర్లకు నోటీసులు ఇచ్చామన్నా రు. నోటీసులకు సమాధానం వచ్చిన వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుకు నేడే ఆఖరు

తుగ్గలి: రైతు భరోసా పథకానికి అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకునేందుకు గురువారంతో గడువు ముగుస్తుందని వ్యవసాయశాఖ మండలాధికారి పవన్‌కుమార్ తెలిపారు. రైతులు తమ సమీపంలోని ఆర్‌బీకేల్లో పత్రాలు ఇచ్చి సరిచూసుకోవాలన్నారు. అదేవిధంగా పీఎం కి సాన్ నగదు కోసం ఈ-కేవైసీ తప్పనిసరిగా చే యించుకోవాలన్నారు. ఆర్‌బీకేల్లో ఉన్న వీఏఏలకు పూర్తి సమాచారం అందించాలని కోరారు.

పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు

చిప్పగిరి: థర్డ్ పార్టీ సహకారంతో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టినట్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ భవ్య తెలిపారు. బుధవారం స్థానిక జగనన్న కాలనీలో కంప చెట్లు, చెత్త చెదారం తొలగించారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని నగరడోణ, రామదుర్గం, బెల్డోణ, ఏరూరు, కుందనగుర్తి, తదితర గ్రామాలలో మొత్తం 170 గృహాలు థర్డ్ పార్టీ సహకారంతో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

విత్తనశుద్ధితో ప్రయోజనాలు

చిప్పగిరి: విత్తనశుద్ధితో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ ఆనంద్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఖరీఫ్ సమీపిస్తుండడంతో రైతులు విత్తన సేకరణకు సమాయత్తం అవుతున్నారన్నారు. పొలంలో విత్తేందుకు ఎంచుకున్న విత్తనాలను తప్పకుండా శుద్ధి చేయాలని సూచించారు. విత్తన శుద్ధి చేయడం ద్వారా రసం పీల్చే పురుగులతో పాటు విత్తనానికి నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టవచ్చని, తద్వారా మొక్కలు ఆరోగ్యంగా పెరిగి దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు.

నేడు డీఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం

ఎమ్మిగనూరురూరల్: సబ్-డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రారంభించనున్నారు. ఆదోని రోడ్డు టీబీపీ కార్యాలయం సమీపంలో నూతనంగా డీఎస్పీ కార్యాలయం సిద్ధం చేశారు. భవనం ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, డీఎస్పీ బి.సీతారామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, తదితరులు హాజరుకానున్నట్లు టౌన్ సీఐ మధుసుధన్‌రావు బుధవారం సాయంత్రం తెలిపారు.

రైతు భరోసా జాబితా ప్రదర్శన

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ పెట్టుబడి సాయంగా అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా పథకానికి సంబంధించి అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించినట్లు ఏఓ హేమలత తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద జాబితాలను ప్రదర్శించినట్లు చెప్పారు. మండలంలో 7,340 మంది రైతులను అర్హులుగా గుర్తించామని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే నేటిలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో కుక్కల వైద్య శిబిరం నిర్వహించి టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి కృష్ణానాయక్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు చెప్పారు.

ఆలూరు సీఐగా వెంకటేశ్వర్లు

ఆలూరు: స్థానిక పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.వెంకటేశ్వర్లును నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులను జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఆర్.ఈశ్వరయ్యను గత నెలలో వివిధ కారణాలతో వీఆర్‌కు పంపారు.ఆ స్థానంలో ప్రస్తుతం సీఐ బి.వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

యువతి ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఆంజనేయులు కుమార్తె కావేరి (21)కి కొంత కాలం క్రితం గుండె శస్త్రచికిత్స జరిగింది. అప్పటినుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో కొంత కాలం క్రితం గుంతకల్లులోని మిల్లు కాలనీలో ఉంటున్న చిన్నాన్న బసప్ప ఇంటికి వచ్చిన ఆమె.. బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

‘ఉపాధి’ అక్రమాలకు చెక్

- ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్టర్ నమోదు
- అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట
- ఏపీఓ అబ్దుల్‌షుకూర్



అమకతాడు సమీపంలో ఎన్ఎంఎంఎస్ విధానంలో మస్టర్ వేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, స్థానిక టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే పనులు జరిగేవి. గతంలో ప్రభుత్వం నుంచి వచ్చే నిధులకు.. వాస్తవంగా లబ్ధి పొందే వేతనదారులకు పొంతన ఉండేది కాదన్న ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. పనుల్లోకి రాకున్నా తమ అనుయాయుల పేరిట మస్టర్ వేసి ఉపాధి నిధులు దోచేసేవారనే ఆరోపణలు కూడా ఎక్కువగా వచ్చేవి. అలాంటి వాటికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చెక్ పడింది. సాధ్యమైనంత మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో నేషన్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ఆన్‌లైన్ హాజరు విధానాన్ని తీసుకొచ్చి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈ పథకంలో ఒకప్పుడు అక్రమాలు ఎక్కువగా జరిగేవి. పనులకు హాజరుకాకున్నా మస్టర్‌లో హాజరు వేసుకుని నిధులు నొక్కేసేవారు. సామాజిక తనిఖీల్లో ఇలాంటి ఎన్నో అవకతవకలు బయట పడ్డాయి. దీంతో ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేతనదారుల మస్టర్ నమోదులో అక్రమాలకు తావు లేకుండా చర్యలు చేపట్టింది. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ ఎన్ఎంఎంఎస్‌ను అమలు చేస్తోంది. ప్రస్తుతం ఉపాధి పనులకు జిల్లాలో రోజుకు లక్షన్నర మంది దాకా వస్తున్నారు. వీరందరి హాజరు కూడా ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

రెండు పూటలా హాజరు..

గతంలో ఎన్ఎంఎంఎస్ ద్వారా 20 మంది కంటే ఎక్కువ మంది పనులకు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీలుండేది. అంతకు సంఖ్య తగ్గితే ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు ఉండేది కాదు. ప్రస్తుతం ఎన్ఎంఎంఎస్ ద్వారా సంఖ్యతో పని లేకుండా కేవలం ఒక్క కూలీ ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందే. ఒకవేళ ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయకపోతే ఎటువంటి పేమెంట్ ఉండదు. ఈ యాప్ ద్వారా రెండుసార్లు పని ప్రదేశంలో ఫొటో తీసి ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. మస్టర్‌లో పది మంది వేతనదారుల వివరాలు ఒకసారి నమోదు చేయాలి. ఒక పనికి 25 మంది హాజరైతే మూడు సార్లు మస్టర్ వేస్తారు. మస్టర్‌లో ఎంత మంది హాజరు ఉంటే అంత మంది కనిపించేలా ఫొటో తీయాల్సి ఉంటుంది. ఉదయం ఏడు గంటలకు మస్టర్ వేసి ఫొటో అప్‌లోడ్ చేసిన నాలుగు గంటల తరువాత మరోసారి మస్టర్ వేసి వేతనదారుల ఫొటో అప్‌లోడ్ చేయాలి. మస్టర్‌కు.. ఫొటోలో కనిపించే వేతనదారుల సంఖ్యకు తేడా వస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు.

జనవరి నుంచి పకడ్బందీగా అమలు

2023 జనవరి 1 నుంచి ఎన్ఎంఎంఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. 2006లో ఈ పథకం ప్రారంభం కాగా వేతనదారుల మస్టర్ నమోదులో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రారంభంలో మాన్యువల్‌గా మస్టర్ వేసేవారు. అనంతరం 2021 జనవరి ఒకటో తేదీ వరకు ఎన్ఎంఎంఎస్ పోర్టల్‌లో ఫీడ్ చేయడం ద్వారా హాజరు వేసేవారు. 20 మంది కంటే ఎక్కువ వేతనదారులు ఉంటేనే ఈ విధానం అమలయ్యేది. ఈ జనవరి ఒకటో తేదీ నుంచి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో పనిచేసే చోటే హాజరు నమోదు చేస్తున్నారు. దీంతో వేతనదారుల వాస్తవ హాజరుపై స్పష్టత వచ్చింది.

చాలా వరకు అక్రమాలు తగ్గాయి

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చాలా వరకు తగ్గిపోయాయి. ఎన్ఎంఎంఎస్ హాజరు విధానం ద్వారానే కూలీలకు వేతనాలు అందిస్తున్నాం. బినామీలు, అనర్హులు లబ్ధి పొందే అవకాశ ఏ మాత్రం లేదు. విస్తృతంగా తనిఖీలు జరిపి పనుల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ప్రస్తుతమున్న ఆన్‌లైన్ హాజరు విధానం నుంచి వ్యక్తిగత పనులకు మినహాయింపు ఉంది.

– అబ్దుల్‌షుకూర్, ఏపీఓ, కృష్ణగిరి

అక్రమాలకు అడ్డుకట్ట

ఉపాధి హామీ పథకం ప్రారంభంలో వేతనదారుల మస్టర్ల విషయంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయి. సోషల్ ఆడిట్ జరిగినప్పుడు ప్రతి చోట హాజరు విషయంలోనే సమస్యలు తలెత్తేవి. కొన్ని చోట్ల ఘర్షణ వాతావరణం నెలకొనేది. అంటే ఫీల్డ్ అసిస్టెంట్లు కొంత మంది కుటుంబసభ్యులు, వారి అనుకూలమైన వారు పనులకు రాకపోయినా మస్టర్ వేసి అక్రమాలకు పాల్పడిన సంఘటనలు బయటపడ్డాయి. ఆలా బయటపడ్డాక స్వాహా చేసిన సొమ్మును చెల్లించకుండా కాలయాపన చేసేవారు. ప్రస్తుతం అమల్లోకి నూతన విధానంతో ఇలాంటి అక్రమాలకు చెక్ పడింది.

19న వాహనాల వేలం

ఆలూరు రూరల్: ఆలూరు సెబ్ పరిధిలోని 5 మండలాల్లో అక్రమ మద్యం, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 19వ తేదీన వేలం వేయనున్నట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్ బుధవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నంద్యాల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఆలూరులోని సెబ్ స్టేషన్ ఆవరణంలో వాహనాల వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5 వేల నగదు చలానా చెల్లించి వేలాల్లో పాల్గొన్నవచ్చని సెబ్ సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించండి

ఎమ్మిగనూరుటౌన్: వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున దుకాణాలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు ఆయా యజమానులు తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.శారద సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు చల్లటి నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని ప్రదేశంలో అందుబాటులో ఉంచాలన్నారు. నీడ ప్రదేశంలో కార్మికులతో పనులు చేయించుకోవాలని సూచించారు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు టోపీలు ఇవ్వాలన్నారు. కార్మికులకు వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స అందించేందుకు వైద్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో వడదెబ్బ తగిలి కార్మికులు చనిపోతే యజమాని పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్మికులకు వడదెబ్బ తగలకుండా తగిన సౌకర్యాలు సమకూర్చి పనులు చేయించుకోవాలని సూచించారు.

పేదల ఇళ్లలో నవరత్నాల వెలుగులు

ఎమ్మిగనూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి చేకురుతోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మాసుమాన్‌దొడ్డి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల గడప వద్దకే చేరుతున్నాయన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ జగనన్న అమలు చేశారన్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న, నాయకులు రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భీమిరెడ్డి, వెంకటేష్, తిక్కయ్య, గోరంట్ల, వెంకట్రాముడు, బుక్క నాగేష్, ఎంపీడీవో బంగారమ్మ, ఈఓఆర్డీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాసుమాన్‌దొడ్డిలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

పగిలిన బండరాయి పరిశీలన

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీలో నరసప్ప దేవాలయం వద్ద ఎండ వేడిమికి పగిలిన భారీ కొండ రాయిని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా మేనేజర్ అనుపమ, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. ఎండ వేడిమికి ఏప్రిల్ 9న భారీ కొండరాయి రెండుగా చీలిన సంగతి తెలిసిందే. చీలిక అప్పటికీ ఇప్పటికీ ఏమైనా తేడా ఉందా అని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కాలనీ వాసులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం కొండను పరిశీలించి మేజర్‌మెంట్ తీసుకున్నట్లు తెలిపారు. బండరాయికి ఒక వైపు ఇనుప కడ్డీలు ఏర్పాటు చేసి మరో వైపు నుంచి తొలగిస్తామని తెలిపారు. పరిశీలన నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆయన చెప్పారు. కలెక్టర్ ఉత్తర్వులతో తర్వలో పనులు ప్రారంభిస్తామన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, మైనింగ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రయాణికుల ఆందోళన

హొళగుంద: ఆదోని ఆర్టీసీ బస్సులు రూటు మార్చడం పట్ల బుధవారం రాత్రి హెబ్బటంకు వెళ్లాల్సిన ప్రయాణికులు హొళగుంద బస్టాండులో బస్సు ముందుకెళ్లకుండా ఆందోళనకు దిగారు. దాదాపు 25 మంది ప్రయాణికులు రాత్రి హెబ్బటం వెళ్లేందుకు హొళగుంద బస్టాండుకు చేరుకున్నారు. బస్సు హెబ్బటం మీదుగా వెళ్లదని, ఎల్లార్తి మీదుగా వెళ్తుందని డ్రైవర్, కండెక్టర్ చెప్పడంతో అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. దీనిపై ఆర్టీసీ సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. హెబ్బటం మార్గంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఉన్నతధికారులు ఆదేశాల మేరకు ఎల్లార్తి మీదుగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సమస్యను మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు హెబ్బటం మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. గురువారం నుంచి బస్సు హొళగుంద - ధణాపురం మార్గంలోనే తిరిగేలా మంత్రి చర్యలు తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశా విలేకరులకు తెలిపారు.

జగనన్న విద్యాకానుకలు సిద్ధం

పత్తికొండటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరానికి పంపిణీ చేసేందుకు అవసరమైన జగనన్న విద్యాకానుకలు ఆయా మండల కేంద్రాలకు చేరినట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ తెలిపారు. బుధవారం పత్తికొండలో ఎంఆర్‌సీ భవనంలో భద్రపరచిన విద్యాకానుక కిట్లలోని వస్తువులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,92,955 మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు విద్యాకానుకలు ఆయా మండల స్టాకు పాయింట్లకు చేరాయన్నారు. జూన్ 1వ తేదీలోగా కిట్లను మండల కేంద్రాలకు చేర్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. అక్కడనుంచి జూన్ 11వతేదీలోగా ఆయా పాఠశాలలకు తీసుకెళ్లాలని, బడి తెరిచిన రోజునే విద్యార్థులకు పంపిణీ చేసేలా ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి, డిప్యూటీ ఈఓ సుకుమార్, ఎంఈఓ మస్తాన్‌వలి, సీఆర్‌పీ తులసిరెడ్డి ఉన్నారు.



విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి తీర్చిదిద్దిందని ఏపీసీ డాక్టర్ కే.వేణుగోపాల్ అన్నారు. బుధవారం మద్దికెరలో జగనన్న విద్యా కానుకకు సంబంధించి స్కూల్ యూనిఫామ్స్, బ్యాగులు, పుస్తకాలను పరిశీలించారు. విద్యాకానుకలోని వస్తువులు అత్యంత నాణ్యతతో ఉన్నట్లు తెలిపారు.

లక్ష్యం మేరకు పనులు కల్పించండి

కృష్ణగిరి: ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతో మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వారు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మండలంలో రోజుకు దాదాపు 6 వేల మంది కూలీలకు పనులు కల్పిస్తుండటంతో జిల్లాలో రెండవ స్థానంలో ఉన్నామన్నారు. మరో వారం రోజుల్లో మండలాన్ని మొదటి స్థానంలోకి తీసుకొచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. ఈసీ శేషిరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

రూ.26 కోట్లతో మార్కెట్ యార్డుల అభివృద్ధి

ఆలూరు: జిల్లాలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల అభివృద్ధితో పాటు రూ.26కోట్లతో లింక్ రోడ్ల పనులు కొనసాగుతున్నాయని జిల్లా మార్కెటింగ్ అగ్రిటెక్ అధికారి ఏ.నారాయణమూర్తి తెలిపారు. ఆయన బుధవారం ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, మార్కెట్ యార్డులలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు డిగాడిగేటర్స్ ద్వారా కొనసాగుతున్నాయన్నారు. పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం మార్కెట్ యార్డులలో క్రయవిక్రయాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎంపీ ఎఫ్‌సీ ద్వారా 95 గోదాములు 500 వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్నామని, ఇప్పటివరకు 65 మంజూరు కాగా 16 పూర్తయినట్లు మార్కెట్ అధికారి నారాయణ మూర్తి తెలిపారు. అనంతరం ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ.. రైతులు పండించిన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డీడీఏ నారాయణమూర్తిని కోరారు. యార్డు కార్యదర్శి శాంతకుమార్, కమిటీ సిబ్బంది తదితరులు ఉన్నారు. అలాగే ఈనెల 28న యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్యకర్తలు, డైరెక్టర్లు తదితరులు హాజరుకావాలని కోరారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

కృష్ణగిరి: ఈ ఖరీఫ్‌లో రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద వేరుశనగ, కంది, కొర్ర విత్తనాలను అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. మండలానికి కే6 రకం 2,100 క్వింటాళ్ల వేరుశనగ, ఎల్ఆర్‌జీ-51 రకం కంది 25 క్వింటాళ్లు, కొర్ర ఎస్ఏఐ 3155 రకం 8.4 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో వీటిని అందిస్తుందని, అన్ని ఆర్‌బీకేల్లో డీ-కృషి యాప్ ద్వారా రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలియజేశారు. ఎకరా పొలం ఉన్న రైతులకు 30 కేజీల వేరుశనగ బ్యాగులు రెండు, ఎకరాకు మించి ఉంటే మూడు బ్యాగ్‌లు అందిస్తారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి

ఎమ్మిగనూరు: జిల్లా రైతాంగానికి మేలుచేసేలా సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని రాయలసీమ జల పరిరక్షణ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం డీటీఎఫ్ కార్యాలయంలో జలజాగరణ దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. మే 31నుంచి జూన్ 1 వరకు జరిగే జలజాగరణ దీక్షను జయప్రదం చేయాలని కోరారు. నాగలదిన్నె బ్రిడ్జి కింద తుంగభద్ర నదిలో జలజాగరణ దీక్ష పోస్టర్లు చేపట్టి నిరసన తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

హొళగుంద: ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని డీడీఓ, పత్తికొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన హొళగుంద పీహెచ్‌సీని సందర్శించి కొత్తగా బాధ్యతలు చేపట్టిన మహిళా డాక్టర్ బిందుమాధవి, డాక్టర్ న్యూటన్‌తో సమావేశమయ్యారు. రోగులకు అందించే సేవలు, రికార్డుల మేయింటనెన్స్, ఇతర విషయాలపై సలహాలు, సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీలో డెలివరీలు రికార్డు స్థాయిలో చేస్తున్నట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ పద్మావతి సూచించారు. ఆమె బుధవారం మండల పరిసరాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతుల పొలాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి సిబ్బంది నివేదికలు తయారుచేసి పంపాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఏపీఓ రవీంద్రనాథ్, టీఏ నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ ఉన్నారు.

అడిగిన వారందరికీ పనులు

తుగ్గలి: జాబ్‌కార్డు కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ రామకృష్ణ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన పనులు, కూలీల వేతనాలకు సంబంధించి సమీక్షించారు. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.272 వేతనం అందుతుందని, దీనిపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పనుల్లో అవకతవకలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈసీ ప్రదీప్ వెంట ఉన్నారు.

వెలుగు ఏపీఎంగా మహేశ్వరయ్య

కృష్ణగిరి: కృష్ణగిరి మండల వైఎస్సార్ క్రాంతి కార్యాలయం ఏపీఎంగా కే.మహేశ్వరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న దాసన్న పెద్దకడబూరుకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో అక్కడి నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అందరి సహకారంతో పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పత్తికొండ రూరల్: పేదల బతుకుల్లో ప్రభుత్వం సంక్షేమ వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని హోసూరు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సీసీ రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే సీసీ రోడ్డు మంజూరు చేయించి కాలనీవాసులతో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివక్షకు తావులేకుండా పారదర్శకంగా పథకాలను అమలుచేయడంలో సీఎం జగనన్నకు ఎవరూ సాటిలేరన్నారు. తమ ప్రభుత్వంలో ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా అర్హుల ఖాతాకే సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ నారాయణదాస్, సర్పంచ్ నాగప్ప, నాయకులు కారంనాగరాజు, శ్రీరంగడు, మోహన్, శ్రీనివాసులు, కేశప్ప, నెట్టేకల్, శాంతిరెడ్డి, నాగిరెడ్డి, ఎంపీడీఓ పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.



హోసూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

గోనెగండ్ల: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఏఓతో పాటు ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు ఖాద్రీ హాజరై మాట్లాడారు. విత్తన డీలర్లు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. బిల్ బుక్కులు, విత్తన రకం, కంపెనీకి సంబంధించి సోర్స్ ఆఫ్ సప్లై ఫెల్ మెయింటెయిన్ చేయాలన్నారు. ప్రతి బిల్లును మండల ఏఓతో సర్టిఫై చేసుకోవాలని సూచించారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని, నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఓ రాజాకిషోర్, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

వెల్దుర్తి (కృష్ణగిరి): రైతుల అవసరాలను ఆసరా చేసుకుని అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆలూరు ఏడీఏ సునీత హెచ్చరించారు. వెల్దుర్తిలోని బాలాజీ సీడ్స్, ధనలక్ష్మి, మన గ్రోమోర్ విత్తన దుకాణాలను బుధవారం ఆమె ఏఓ అక్బర్‌బాషాతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్స్, రికార్డులు, బిల్లులు, గోడౌన్‌లోని స్టాకు తదితరాలను పరిశీలించారు. దుకాణదారులు అమ్మకాలు, రిజిస్టర్లు, స్టాకు మెయింటెనెన్స్ వివరాలు సక్రమంగా ఉంచుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి, మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను అధికారులు సందర్శించి కారణాలను తెలుసుకొని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ నాగేష్, హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టండి

తుగ్గలి: జగనన్న లేఅవుట్లలో అన్ని మౌలిక వసతులతో పాటు, ఇంటి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తామని త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి పక్కా ఇళ్లు పూర్తి చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ సూచించారు. వారు బుధవారం తుగ్గలి జగనన్న కాలనీని సందర్శించారు. లేఅవుట్‌లో మొత్తం 84 ఇళ్లకుగాను 46 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగతా 38 ఇళ్ల నిర్మాణం ఎందుకు ప్రారంభించలేదని అడగ్గా.. ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు నీటి సమస్య ఉందని, ట్యాంకర్లతో నీరు కొనుగోలు చేసి కట్టుకునే స్థోమత తమకు లేదని లబ్ధిదారులు తెలిపారు. నీటి సమస్య తీరుస్తామని వెంటనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సర్పంచ్ రామాంజినేయులు, డీఈ గురుప్రసాద్, ఏఈ విజయకుమార్, ఏపీఎం రాధాకృష్ణ, ఉన్నారు.

ఆలూరు రూరల్/హాలహర్వి: ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హాలహర్వి మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. ఆయన బుధవారం మండలంలోని హర్ధగేరి, మెదేహాల్ గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 830 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయని, 290 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగతా 485 ఇళ్ల నిర్మాణాలను థర్డ్ పార్టీ వారికి అప్పగించినట్లు చెప్పారు. అనంతరం ఆ గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.

హొళగుంద: ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి లక్ష్యాన్ని పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రామచంద్రయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సుళువాయి గ్రామంలో జగనన్న కాలనీని సందర్శించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పనుల వేగవంతంపై పలు సూచనలు చేశారు.

సత్వర పరిష్కారం చూపండి

నందవరం: ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, జగనన్న చెబుదాం, స్పందన రీఓపెన్ అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీఎస్‌డబ్ల్యూఎస్ ఆక్టివిటీస్, ఏపీ సేవా సర్వీసును నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని, స్పందన అర్జీలను నిశితంగా చదివి ప్రభుత్వ సూచనల మేరకు అర్జీదారులకు సంతృప్తికరమై సమాధానం చెప్పాలన్నారు. రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్, భూ సమస్యల పై వచ్చే అర్జీలకు సంతృప్తికరమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. తహసీల్దార్ నిత్యానంద రాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓ సుదర్శన్ రెడ్డి, హౌసింగ్ ఇన్చార్జ్ ఏఈ గురుస్వామి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండలస్థాయి అధికారులతో సమీక్షిస్తున్న నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య

ఎమ్మిగనూరురూరల్: ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో ప్రజలు ఫోన్ ద్వారా సూచించిన సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్ ఆదేశించారు. ఆయన బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి రెండు గంటలకోసారి మెయిల్స్ చెక్ చేసుకోవాలని, అర్జీలు వచ్చి ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో బంగారమ్మ, హౌసింగ్ ఏఈ రామనాథరావు పాల్గొన్నారు.